సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ; 1 ; మార్చి ; 2024



నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 8లో▸



ఇన్‌స్టా పరిచయం..

ఆంధ్ర అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ప్రేమగా మారి.. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. 8లో▸



వేధిస్తే కఠిన చర్యలు

బాలికలను వేధిస్తే చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి ఇందిరా హెచ్చరించారు. 8లో▸

న్యూస్‌రీల్

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారి అజార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అజార్

షాద్‌నగర్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అజార్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లకు గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అజార్ మాట్లాడుతూ... మార్చి 3న ప్రభుత్వం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ స్వర్ణకుమారి, శ్రీహరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు

కందుకూరు: ఉపాధి కూలీలకు వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత అధికారులను ఆదేశించారు. మండల పరిధి లోని రాచులూరు, బేగంపేట గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆమె తనిఖీ చేశారు. వన నర్సరీని పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు చేసే ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం షేడ్ నెట్ల ఏర్పాటు, వడదెబ్బ తగలకుండా అవసరమైతే ఉపయోగించేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీల్లో ఉన్న ఖాళీ బెడ్స్‌లో నీడనిచ్చే మొక్కలు, అవెన్యూ ప్లాంట్లు పెంచాలని, నిత్యం మొక్కలకు నీరు అందించాలని సూచించారు. ఆమె వెంట ఏపీడీ సక్రీయనాయక్, ఎంపీడీఓ సరిత, పంచాయతీ కార్యదర్శి సెల్వమణి, ఈసీ, టీఏలు తదిరులున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం బర్కత్‌పల్లికి చెందిన బీరయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.2.5 లక్షల చెక్కును బీరయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కసిరెడ్డి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాలకు న్యాయం చేస్తామన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాములు యాదవ్, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రపంచ నగరాల సదస్సుకు మేయర్‌కు ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: సింగపూర్‌లో జూన్ 2 నుంచి 4 వరకు జరగనున్న 9వ ప్రపంచ నగరాల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నగర మేయర్ విజయలక్ష్మిని ఆహ్వానించారు. మేయర్లు, వ్యాపారవేత్తలు, పట్టణ నిపుణులు పాల్గొనే ఈ సదస్సులో లివబుల్ అండ్ సస్టైనబుల్ సిటీస్, రిజువనేట్, రీ ఇన్వెంట్, రీ ఇమేజిన్ అంశాలపై చర్చిస్తారన్నారు. స్మార్ట్ సిటీల లక్ష్యసాధనకు, అందరికీ మంచి నగర జీవితాన్ని అందించేందుకు చర్చలు ఉపకరిస్తాయన్నారు.

సబ్బు.. పౌడర్‌తోనే సరి!



మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కిట్ల కొరత

- రెండేళ్లుగా నిలిచిన సరఫరా
- కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్‌గా మార్చిన కాంగ్రెస్ సర్కార్
- తాజాగా న్యూట్రిషన్ కిట్లనూ సరఫరా చేయని వైనం
- జిల్లాలో నెలకు సగటున 3వేల ప్రసవాలు
- గర్భిణులు, బాలింతల ఖాతాల్లో జమకాని ప్రోత్సాహక నగదు
- 25వేల మందికి పైగా ఎదురుచూపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) సహా న్యూట్రిషన్ కిట్లకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో ప్రస్తుతం సబ్బులు, పౌడర్, ఆయిల్, దువ్వెన, దోమతెర, ఇతర వస్తువులను మాత్రమే అందజేస్తున్నారు. బాలింతల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నప్పటికీ నగదు మాత్రం వారి అకౌంట్లలో జమకావడం లేదు.ఎంసీహెచ్ కిట్ల కింద తల్లులకు అందించే నగదు ప్రోత్సాహకం రెండేళ్ల క్రితమే నిలిచిపోగా.. తాజాగా గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. మాతా శిశుమరణాల రేటును తగ్గించడంతో పాటు ఆస్పత్రిలో ప్రసవాలు అయ్యేలా చూడటం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు గత ప్రభుత్వం ఈ రెండు పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మొదట్లో భారీగా నిధులు కేటాయించిన ప్రభుత్వం .. ఆ తర్వాత నిధుల విడుదలలో జాప్యం చేస్తూ వచ్చింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ఈ కిట్ల పంపిణీపై దృష్టిసారించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 65శాతం..

జిల్లాలో నెలకు సగటున 3వేల ప్రసవాలు జరుగుతున్నట్లు అంచనా. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 65శాతం ప్రసవాలు జరుగుతుండగా, ప్రైవేట్‌లో 35 శాతం జరుగుతున్నాయి. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలనే ఆలోచనతో 2017 మార్చి 3న అప్పటి ప్రభుత్వం మదర్ అండ్ హెల్త్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. దీనికి కేసీఆర్ కిట్టుగా నామకరణం చేసింది. ఈ పథకంలో భాగంగా ప్రసవం తర్వాత తల్లీబిడ్డల సంరక్షణ కోసం 15 రకాల వస్తువులతో పాటు పాప పుడితే రూ.13,000, బాబు పుడితే రూ.12,000 నగదు చెల్లించాలని నిర్ణయించింది.ఆ మేరకు అప్పటి నుంచి ఇప్పటివరకు 1,05,332 మంది గర్భిణులు తమ పేర్లు పోర్టల్‌లో నమోదు చేయించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని ఎంసీహెచ్ కిట్‌గా పిలుస్తున్నారు. రెండేళ్లుగా ఈ పథకానికి సరిపడా నిధులు మంజూరు చేయడం లేదు.

రూ.30 కోట్లకుపైగా పెండింగ్

ప్రైవేట్ ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించే ఆర్థిక స్తోమత లేని వారంతా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చూయించుకుంటారు. ప్రసవానికి ముందే వీరంతా తమ పేర్లను ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించుకుంటున్నారు. వీరికి నాలుగు విడతల్లో.. తొలి విడతగా ఐదో నెలలో రూ.3వేలు, ప్రసవం అయ్యాక కుమార్తె పుడితే రూ.5వేలు, కుమారుడు పుడితే రూ.4వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. పాప లేదా బాబుకు మూడున్నర నెలల టీకా వేయించే సమయంలో రూ.2వేలు, తొమ్మిది నెలల టీకా వేయించే సమయంలో మిగిలిన మొత్తం రూ.3వేలు అందజేయాల్సి ఉంది.అయితే జిల్లాలో రెండేళ్ల క్రిత మే నగదు పంపిణీ నిలిచిపోయింది. ఏఎన్ఎంలు, ఆయాలు, వైద్య సిబ్బంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేసి ప్రక్రియ మొత్తం పూర్తిచేసి సిద్ధంగా ఉంచినప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో ఆయా లబ్ధిదారులంతా ఆందోళన చెందుతున్నారు. ఇలా జిల్లాలో ఇప్పటివరకు 25 వేల మందికిపైగా లబ్ధిదారులు కిట్‌లో భాగంగా అందే నగదు కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. 2023 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ చివరి నాటికి జిల్లాలో 26,702 ప్రసవాలు జరగ్గా.. వీటిలో 16,440 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చారు. వీరిలో 11వేల మందికిపైగా ఎంసీహెచ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించుకుని నగదు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం వీరికి రూ.30 కోట్లకుపైగా బాకీపడినట్లు సమాచారం.

పాడైన నెయ్యి, పల్లి చిక్కీలు..

గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం గతేడాది న్యూట్రిషన్ కిట్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ న్యూట్రిషన్ కిట్‌లో భాగంగా ఐరన్ సిరప్, డేట్స్, మదర్ హార్లిక్స్, నెయ్యి, పల్లి చిక్కీలు, ఐరెన్ ఫోలిక్ టాబ్లెట్లను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు ఇచ్చేవారు. జిల్లాలో ఇప్పటివరకు 45,763 మంది గర్భిణులను గుర్తించారు. వీరిలో 11,061 మందికి మాత్రమే న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. అయితే ఈ కిట్లలోని నెయ్యి, పల్లీ చిక్కీలు పాడైపోయాయి. దీంతో పాడైన వాటితో పాటు గడువు ముగిసిన వాటిని ఆస్పత్రులవారు తిప్పి పంపారు. ప్రస్తుతం జిల్లాలోని ఏ ఒక్క ఆరోగ్య కేంద్రంలోనూ ఈ న్యూట్రిషన్ కిట్లు లేవు.

ఐదేళ్లలో జిల్లాకు కేటాయించిన కిట్లు, నగదు

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారులు	కేటాయించిన నిధులు	కిట్స్ పంపిణీ
2017-18	30,539	రూ.10.02 కోట్లు	5,912
2018-19	14,419	రూ.10.20 కోట్లు	6,877
2019-20	23,150	రూ.18.43 కోట్లు	5,882
2020-21	15,330	రూ.14.50 కోట్లు	7,121
2021-22	10,719	రూ.11.58 కోట్లు	7,381
2022-23	11,175	రూ.12.21 కోట్లు	8,154

సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శశాంక

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవి సమీపించిన దృష్ట్యా మున్సిపాలిటీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో.. నీటి ఎద్దడి నివారణ చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే వేసవి ప్రారంభమైందని నీటిఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని ఏఒక్క గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి రానివ్వకూడదన్నారు. లీకేజీ సమస్యలను పరిష్కరించడం, కొత్త పైప్‌లైన్ కనెక్షన్లు ఇవ్వడం, బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్ వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ, మిషన్‌భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఎస్ఈ పీఆర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి..

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో వచ్చే ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కగా అమలు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించిన నో డల్ అధికారులు, డీఏఓలతో కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీ నుంచి ఉపఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యిందన్నారు. అప్పటి నుంచే కోడ్ మన జిల్లాలో కూడా అమల్లో ఉందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలైన్ టీంల బాధ్యతలను తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎన్నికల కోడ్ వర్తిస్తుందని.. జిల్లాలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటికి సంబంధించిన సహాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ఈ సమావేశంలో సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీలత, సీపీఓ సౌమ్య, జిల్లా పరిశ్రమల అధికారి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, డీఏఓలు పాల్గొన్నారు.

పాడిరైతుల సమస్యలు పరిష్కరించండి



చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ వేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిన్నారెడ్డిని గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విజయ డెయిరీని మూసివేయించేందుకు ప్రైవేట్ రంగ డెయిరీలు కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలను దిగుమతి చేసుకొని ఇక్కడి పాడిరైతులకు నష్టాలు కలిగిస్తున్నాయని ఆరోపించారు. విజయ డెయిరీ ఎక్కువ ధర చెల్లించి పాలను సేకరించలేకపోతుందని అన్నారు. పాడి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గత కొంతకాలంగా విజయ డెయిరీ పాడి రైతులకు డబ్బులు ఇవ్వడంలేదని, ఆ డబ్బులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అందించే ఇన్సెంటివ్ బోనస్ కూడా ఇవ్వడంలేదని.. వాటిని కూడా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

టెలికాం రంగ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

- ట్రాయ్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: భాతరదేశంలో టెలికాం రంగాన్ని ఊహించని రీతిలో అభివృద్ధి చేశామని ట్రాయ్ అడ్వైజర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రవీణ్‌కుమార్ మట్లాడుతూ.. టెలికాం ఆపరేటర్స్ పారదర్శక సేవలందించేలా ట్రాయ్ వారికి సూచనలు చేస్తుందన్నారు. భారతదేశంలో 118.57 కోట్ల టెలికాం వినయోగదారులున్నారన్నారు. టెలీ సాంద్రత 84.97 శాతం ఉందని, 88.1 కోట్ల ఇంటర్నెట్ వినియోదారులు ఉంగా ఇప్పటి వరకు 91.4 కోట్ల మంది ఎంఎన్‌పీ ద్వారా వేరే ఆపరేటర్స్‌కు మారారన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేటా ట్రాయ్ పని చేస్తుందన్నారు. జాయింట్ అడ్వైజర్ కేవీ సురేష్‌బాబు, జగదీశ్ బాబు, కళాశాల చైర్మన్ లక్ష్మీనారయణ, ప్రిన్స్‌పాల్ రమేష్, ట్రాయ్ కాగ్ సభ్యులు, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్, ఐడియా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిపత్య పోరు

- గతనెల 9న అవిశ్వాసంలో ఆదిబట్ల చైర్మన్, వైస్‌చైర్మన్ల తొలగింపు
- మర్రి నిరంజన్‌కు మద్దతు తెలుపుతున్న పాలకవర్గం!
- వైస్ చైర్మన్‌పై తొలగని సందిగ్ధం
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై గతనెల 9న అవిశ్వాసం నెగ్గింది మొదలు ఆయా స్థానాలకు ఎన్నిక ఎప్పుడెప్పుడు జరుగుతుందా, ప్రభుత్వం నోటిఫికేషన్ ఎప్పుడు జారీ చేస్తుందా అని ఆశావహులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇద్దరు బడా నాయకుల మధ్య కోల్డ్‌వార్ కారణంగానే నోటిఫికేషన్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని కొందరంటుంటే కాదు అధికార ప్రక్రియ వల్లే ఆలస్యం అవుతుందని మరి కొంతమంది అంటున్నారు. అవిశ్వాసం పెట్టి చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించి 15 రోజులు అవుతున్నప్పటికీ ఆ పదవులకు ఎన్నిక నిర్వహించడంలో అలసత్వం కనిపిస్తోంది.

నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో..

ఆదిబట్ల మున్సిపాలిటీలో 15వార్డులకు గాను 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థిగా గెలిచిన కొంగరకలాన్‌కు చెందిన కొత్త ఆర్తికగౌడ్.. బీఆర్ఎస్ మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యుల సహకారంతో వైస్ చైర్‌పర్సన్ పదవి కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కోరె కళమ్మను వరించింది. అయితే ఏడాది గడవకముందే విభేదాల కారణంగా బీఆర్ఎస్‌లో ఇమడకపోవడంతో చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్ తిరిగి సొంతగూటి(కాంగ్రెస్)కి చేరారు. అప్పటి నుంచి ఆమె ఒంటెత్తు పోకడలను నిరసిస్తూ 13మంది కౌన్సిలర్లు.. ఈ ఏడాది జనవరి 21వ తేదీన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటిసులు ఇచ్చారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో ఆ ఇద్దరు పదవి కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. తీర్మానం నెగ్గి 15 రోజులు కావస్తున్నా నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీచేయకపోవడంపై ఉత్కంఠ నెలకొంది.

చైర్మన్ రేసులో మర్రి..!

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ రేసులో 9వ వార్డు కౌన్సిలర్, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి మొదటివరుసలో ఉన్నారు. అవిశ్వాస తీర్మానం సమయంలో ఆయన అందరి మద్దతు కూడగట్టి తీర్మానం నెగ్గేలా చేశారు. దీంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా మర్రి నిరంజన్‌రెడ్డికే చైర్మన్ పదవి కట్టబెట్టాలని పట్టుబడుతున్నారు. అయితే వైస్‌చైర్మన్ పదవిపై సందిగ్ధం నెలకొంది. కుల, సామాజిక వర్గాల వారీగా, పార్టీల వారీగా బేరీజు వేసుకుంటున్నారు. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన మర్రి నిరంజన్‌రెడ్డికి చైర్మన్ పదవి కట్టబెట్టొద్దని ఓ బడా ప్రజాప్రతినిధి ఒత్తిడి తీసుకొస్తుంటే మరోవైపు మర్రి నిరంజన్ రెడ్డికి ఓ రాష్ట్ర మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. తనపై గుర్రుగా ఉన్న సదరు బడా ప్రజాప్రతినిధిని మర్రి నిరంజన్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు కలిసి విన్నవించినప్పటికీ ఆయన సుముఖంగా లేరని వార్తలు వినిపిస్తున్నాయి. ఏది ఎమైనా చైర్మన్ పదవిని చేజిక్కించుకోవాలని మర్రి పట్టుబడుతున్నారు. పాలకవర్గం సమావేశాలు కావాలన్నా, అభివృద్ధిపై సమీక్షించాలన్నా, బడ్జెట్ సమావేశాలు పెట్టాలన్నా తప్పకుండా చైర్మన్, వైస్ చైర్మన్ అవసరం కాబట్టి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఎప్పుడు జారీ చేస్తుందో అని సభ్యులందరూ ఎదురుచూస్తున్నారు.

ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ వివాహం

- ఒక్కటైన ఆంధ్రా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన కొత్త జంట


ఏపీ పోలీసులు, బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ, ఎస్‌ఐలు

తాండూరు రూరల్: ఆంధ్ర అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయం.. ప్రేమగా మారి పెళ్లి పీటలు ఎక్కించింది. ఇద్దరూ మేజర్లే కావడంతో ఖమ్మంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీశైలం హైదరాబాద్‌లోని ఓ జ్యూస్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం ఇతనికి ఇన్‌స్టాగామ్‌లో రాజమండ్రికి చెందిన అనూషతో పరిచయం ఏర్పడింది. ఇలా సాగిన వీరి స్నేహం ప్రేమగా మారింది. దీంతో కలిసి జీవితం పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అనూష నుంచి ఫోన్ రావడంతో రాజమండ్రి వెళ్లిన శ్రీశైలం నాలుగు రోజుల క్రితం ఆమెను తీసుకుని ఖమ్మం చేరుకున్నాడు. ఇక్కడే యువతి మెడలో తాళిబొట్టు కట్టాడు. అనంతరం నేరుగా తాండూరుకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా అనూష కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు రాజమండ్రిలోని రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. యువతి సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శ్రీశైలం అడ్రస్ తెలుసుకుని యువతి తల్లిదండ్రులతో కలిసి కరన్‌కోట్ పీఎస్‌కు వచ్చారు. రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి నూతన దంపతులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. తమతో రావాలని ఎంత బతిమాలినా అనూష వినలేదు. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. అనూష అడ్రస్ లభించడంతో అదృశ్యం కేసును కొట్టేస్తామని ఏపీ పోలీసులు తెలిపారు.

నిరుద్యోగులకు గుడ్‌న్యూస్



మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్

- జిల్లాలో 379 ఖాళీలు
- 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తొలిసారి సీబీటీ పద్ధతిలో పరీక్ష

చేవెళ్ల: ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసిన నోటిఫికేషన్‌లో 379 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 61, లాంగ్వేజ్ పండి ట్ 30 పోస్టులు, పీఈటీ ఆరు, ఎస్జీటీ 266, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ టీచర్స్ 10 , ఎస్జీటీ 46 ఖాళీలు ప్రకటించారు. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులకు గడువు నిర్ణయించింది. తొలిసారిగా సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో డీఎస్సీ పరీక్షను మే మాసంలో పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. తాండూరు పట్టణంలో ఇప్పటికే పలు కోచింగ్ సెంటర్లు ఉద్యోగార్థులకు శిక్షణ ఇస్తున్నాయి. గతంలోనూ కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ కోచింగ్ ఇచ్చిన అనుభవాలున్నాయి. మరికొన్ని కోచింగ్ సెంటర్లు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో అభ్యర్థుల మనోగతం వారి మాటల్లోనే..

కండక్టర్ జాబ్ వదిలేశా



14 ఏళ్ల క్రితం బీఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనే లక్ష్యంతో ఉన్నా. 2017 నోటిఫికేషన్‌లో ఉద్యోగం రాకపోవడంతో మరోసారి కోచింగ్ తీసుకున్నా. పదేళ్లుగా నోటిఫికేషన్ రాకపోవడంతో కుటుంబ పోషణకు ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం చేశా. నోటిఫికేషన్ వస్తే ప్రిపరేషన్‌కు ఇబ్బంది అవుతుందని కండక్టర్ జాబ్ వదిలేశా. ఇప్పుడు నోటిఫికేషన్ రావడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ తీసుకుంటా.

– సీహెచ్.శివకుమార్, రామన్నగూడ, చేవెళ్ల

హర్షణీయం



నోటిఫికేషన్ ఇవ్వడం హర్షణీయం. కొత్త ప్రభుత్వం ముందు చెప్పినట్టే ఉద్యోగాల సంఖ్యను పెంచి నోటిఫికేషన్ విడుదల చేసింది. కాలయాపన చేయకుండా ఉద్యోగాలు కల్పించేలా చర్యలుండాలి. విద్యావ్యవస్థలో ఖాళీలు భర్తీ చేస్తే విద్యాభివృద్ధి అనుకూలం. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఈ పోస్టుల భర్తీ చేయాలి. ఈ నోటిఫికేషన్ నిరుద్యోగులకు వరం.

– సుధీర్, గౌరవ అధ్యక్షుడు, టీపీయూఎస్

కోచింగ్‌కు హైదరాబాద్‌కు



డీఎస్సీ నోటిఫికేషన్‌కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్నా. ఎంఏ, బీఈడీ, డీఎడ్ చేశాను. రెండు సార్లు టెట్ క్వాలిఫై అయ్యాను. ఇంత కాలానికి డీఎస్సీ నోటిఫికేషన్ రావడం ఆనందంగా ఉంది. ప్రిపరేషన్‌కు అందుబాటులో కోచింగ్‌సెంటర్లు లేవు. కోచింగ్‌కు హైదరాబాద్‌కే వెళ్లాలి. తప్పనిసరిగా టీచర్ కావాలనే పట్టుదలతో ఉన్నాను.

– లక్ష్మీపావని, మొయినాబాద్

ఐదేళ్ల నిరీక్షణ



గ్రామీణ వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్నా తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించారు. వారి కలలను నిజం చేసేందుకు బీఎడ్ చేసి టెట్ క్వాలిఫై అయ్యా. ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాను. ఇప్పుడు నోటిఫికేషన్ వేయడంతో సంతోషంగా ఉంది. ఈ ప్రాంతంలో కోచింగ్ సెంటర్ లేదు. హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ తీసుకుంటా.

– బట్టిగారి కృష్ణ, గుండాల, చేవెళ్ల

ప్రణాళికతో చదివితే ఉద్యోగం



ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు అకాడమీ పుస్తకాలు, కరెంట్ అఫైర్స్, జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించిన విషయాలపై పట్టు సాధించేలా చదవాలి. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పక్కా ప్రణాళికతో చదవాలి. ప్రాక్టీస్ టెస్టులు రాస్తూ సబ్జెక్టుపై అవగాహన పెంచుకుంటే టీచర్ ఉద్యోగం పక్కా.

– బి.ధనుంజయ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మహేశ్వరం

ఎస్‌ఏ పోస్టులు పెంచాలి



కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషం. ఉద్యోగ సాధనకు ఎన్నో కష్టాలు పడుతున్నాం. లైబ్రేరీలలో పాఠ్య పుస్తకాలు, దినపత్రికలను చదువుతూ ప్రిపేర్ అవుతున్నాం. కొన్ని రోజుల పాటు కస్తూర్బా గాంధీ పాఠశాలలో పని చేశా. ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలి.

– హేమలత, బీఎడ్, యాలాల, వికారాబాద్ జిల్లా

విజయం సాధిస్తా...



డీఎస్సీ పోటీ పరీక్షల్లో కృషి పట్టుదలతో చదివి విజయం సాధిస్తా. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో సంతోషంగా ఉంది. గత కొన్ని రోజులుగా ఎదురుస్తున్న అవకాశం ఇప్పుడు వచ్చింది. ఎది ఏమైన పోటీపరీక్షలల్లో బాగా చదివి విజయంతో పాధ్యాయురాలును కావాలని నా ఆకాంక్ష. నాభర్త సహకారంతో టేట్ క్వాలిఫై అయ్యాను.

– జక్కని స్వప్న, బీకాం బీఈడీ, షాబాద్ గ్రామం

పాడిపశువులు చోరీ

యాచారం: గుర్తు తెలియని దుండగులు ఓ రైతు పాడి పశువులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని గున్‌గుల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన యార కిష్టయ్య రోజు మాదిరిగానే బుధవారం రాత్రి తన వ్యవసాయ క్షేత్రం వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా సుమారు రూ.2లక్షలకు పైగా విలువ చేసే రెండు పాడి పశువులు, ఓ దూడ కనిపించలేదు. దీంతో రైతు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్

డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

యాచారం: నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు ఇబ్రహీంపట్నం న్యాయస్థానం గురువారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన బి.గణేశ్ 2019లో సాగర్‌రోడ్డుపై వాహనాన్ని అతివేగంగా నడిపి గున్‌గుల్ గేట్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన యాచారం పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీసులకు పూర్తి ఆధారాలతో వివరాలు సమర్పించారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఎంవీఎస్ఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

బడంగ్‌పేట్: సాంకేతిక రంగాన్ని విస్తృత పరిచేందుకు నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం డ్యాప్కామ్–24 (డేటా అక్విసిషన్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్) అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఎంవీఎస్ఆర్ చైర్మన్ కేవీఆర్ కశ్యప్, పి.లక్ష్మీనారాయణ అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ సదస్సు సాగనుంది. మొదటి రోజు వివిధ యూనివర్సిటీల నుంచి ఆరు వందల మంది రచయితలు పేపర్లు సమర్పించారు. అందులో 32 పేపర్లు రిజక్ట్ చేశారు. 23 పేపర్లు యూజీసీకి సెలెక్ట్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్లు ఉంటాయని ప్రొఫెసర్ డా.సంధ్య వివరించారు. కార్యక్రమంలో ప్రొ.మోరారు లుమినిటా(రుమేనియా), హెచ్ఓడీ ప్రొ.ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ కనకదుర్గ, సెక్రటరీ శ్రీనివాసరావు, మూర్తి, రాజేశ్ కులకర్ణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోండి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్


మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ కోరారు. గురువారం పట్టణంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం ద్వారా 2.8లక్షల మంది రైతులకు సుమారు రూ.11.8 కోట్ల పెట్టుబడి సాయం చేసినట్లు వివరించారు. గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, 10 కోట్ల మందికి పైగా ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, 12 కోట్ల మందికి ఉచిత మరుగుదొడ్లు నిర్మించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి కాపాడుకునేందుకు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ దిశగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహగౌడ్, రమేశ్, శివలింగం, శేఖర్‌గౌడ్, జగన్, శ్రీను, మల్లేశ్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఇందిర



పుస్తకాలు అందజేస్తున్న జడ్జి ఇందిరా

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా హెచ్చరించారు. మండలంలోని ఉప్పరిగూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం చైల్డ్ చాపర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల పట్ల అసభ్య ప్రవర్తనలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ఇందిరా హాజరై మాట్లాడుతూ.. బాల్యదశ నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులను ప్రేమాభిమానంతో చూసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. చిన్నారులు వేధింపులకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. వీటిని రూపుమాపడానికి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలను వేధింపులకు గురి చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు షేక్ జాకీర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రిషిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులభంగా డబ్బు సంపాదించేందుకు..



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

ద్విచక్రవాహనాల చోరీ

- బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడికి రిమాండ్

తాండూరు రూరల్: సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో ఓ బైక్ మెకానిక్ ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలుబుర్గి జిల్లా సేడం తాలూక కురుగుంట గ్రామానికి చెందిన 21 ఏళ్ల బోస్లే నిఖిల్ బైక్ మెకానిక్. ఈజీగా డబ్బు సంపాదించాలని బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. కొన్ని నెలలుగా వికారాబాద్ రైల్వే స్టేషన్, తాండూరు ఆస్పత్రి, మోమిన్‌పేట్, మన్నెగూడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగతనం చేశాడు. ఫిబ్రవరి 24న గౌతాపూర్ చౌరస్తా వద్ద ఓ బైక్‌ను దొంగతనం చేశాడు. అదే రోజు గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద కరన్‌కోట్ పోలీసేఉలు తనిఖీలు చేపట్టారు. వీరిని గమనించిన నిఖిల్ తప్పించుకునేందుకు యత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. బైక్ పేపర్స్ చూపమని కోరడంతో లేవన్నాడు. దీంతో మెకానిక్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా 12 బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నాడు. వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.